క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా చెక్‌ల పంపిణీ

పూసపాటిరేగ: మండల పరిషత్ కార్యాలయం సమీపంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్‌ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మహంతి కల్యాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని డ్వాక్రా సంఘాలు సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రామతీర్థంలో పారిశుధ్య పనులు



కల్యాణ మంటపం వద్ద పనులు చేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో నెల్లిమర్ల నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు తమ సేవలందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో 12 మంది కార్మికులు బుధ, గురువారాల్లో పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టారు. కల్యాణం నిర్వహించిన మంటపం ప్రాంగణం.. ఆలయ పరిసరాల్లోనూ శుభ్రం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చెత్తను ఎప్పటికప్పుడు తరలించారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, రుద్రప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై సాయినాథుడి ఆశీస్సులు



పాలాభిషేకంలో పాల్గొన్న సాంబశివరావు, అరుణకుమారి దంపతులు

నెల్లిమర్ల: షిర్డీ సాయినాథుడి ఆశీస్సులు నగర పంచాయతీ ప్రజలందరిపై ఉండాలని వైఎస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, మాజీ సర్పంచ్ చిక్కాల అరుణ కుమారి దంపతులు ఆకాంక్షించారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గాంధీనగర్ కాలనీలోనున్న ఆలయంలో షిర్డీసాయి విగ్రహానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఆయన వెంట 2వ వార్డు పార్టీ కన్వీనర్ పైల మురళి, చంద్ర, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మెగా నేత్రవైద్య శిబిరం

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో గురువారం ధీర ఫౌండేషన్ కార్యదర్శి బొత్స సందీప్ ఆధ్వర్యంలో గురువారం మెగానేత్రవైద్యశిబిరం నిర్వహించారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది శిబిరంలో సేవలందించారు. కొవ్వాడపేటతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి శిబిరానికి వచ్చిన 120 మందికి కంటి పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. అలాగే ఉచితంగా మందులు అందజేశారు.

1న వీరాంజనేయస్వామి తీర్థం

గంట్యాడ: మండలంలోని పొల్లంకి గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీన వీరాంజనేయస్వామి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కర్రి కృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం, 2 గంటల నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే తీర్థం సందర్భంగా కబడ్డీ, ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సత్యసాయి మందిర నిర్మాణానికి శంకుస్థాపన



మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చిన్నారావు, సత్యసాయి భక్తులు

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామంలో సత్యసాయి బాబా మందిర నిర్మాణానికి సత్యసాయి భక్తులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబల్ల చిన్నారావు గురువారం భూమిపూజ చేశారు. గ్రామంలో సత్యసాయి భక్తులు అంతా కలిసి మందిర నిర్మాణానికి ముందుకు వచ్చారు. మందిరంలోనే సామాజిక సేవ కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఏడాదిలోపు నిర్మాణం పూర్తిచేయాలని తీర్మానం చేశారు.

జగదానంద కారక..
జయ జానకి ప్రాణ నాయక...

ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడు.. లోక కల్యాణం కోసం ఎన్నో కష్టాలకు ఓర్చిన సీతారాముల పవిత్రబంధం అజరామరమైనది.. భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమైనది. రఘువంశ రామయ్య చైత్ర శుద్ధ నవమి నాడు అయోధ్యలో జన్మించాడు. అనంతరం సీతాదేవిని వివాహమాడి.. తండ్రి ఆజ్ఞానుసారం పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం, రావణ సంహారం తర్వాత చైత్రశుద్ధ నవమి నాడే సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడయ్యాడని భక్తుల నమ్మకం. అందుకే ప్రజలందరూ గురువారం నాడు శ్రీరామ నవమి వేడుకలు వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. అలాగే సీతారాముల కల్యాణం కూడా కనులపండువగా నిర్వహించారు. రామాలయాలు, మంటపాలను సుందరంగా అలంకరించి, వేకువ జామునుంచే పూజలు చేపట్టారు. బెల్లం, మిరియాలతో తయారుచేసిన పానకాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఉత్సవమూర్తుల ఊరేగింపులతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం: నగరంలోని 42వ డివిజన్ పాల్‌నగర్‌లో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు



డెంకాడ: కొండరాజుపేటలో అన్నసమారాధనలో వడ్డిస్తున్న మాజీ సర్పంచ్ సరగడ బంగారురెడ్డి, తదితరులు



డెంకాడ: గంట్లాంలో సీతారాముల కల్యాణ ఉత్సవంలో పూజలు చేస్తున్న బంగారమ్మ దంపతులు,భక్తులు



విజయనగరం టౌన్: పాల్‌నగర్‌లో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



విజయనగరం: తోటపాలెం రామాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న అవనాపు విక్రమ్, భావన దంపతులు



విజయనగరం రూరల్: శ్రీక్షేత్రమ్‌లో రాముడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



భోగాపురం: మండల కేంద్రంలోని తీటవీధిలోని సీతారాముల కల్యాణంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు



విజయనగరం టౌన్: సీతారాముల కల్యాణోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్లు ధనలక్ష్మి, బాబులు



విజయనగరం టౌన్: రింగురోడ్డు సాయినాథ ఆలయంలో కల్యాణోత్సవం



విజయనగరం రూరల్: కోరుకొండలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



పూసపాటిరేగ: సీహెచ్ అగ్రహారంలో పెండ్లిరాట వేస్తున్న గ్రామస్తులు



విజయనగరం టౌన్: సంతపేట రామాలయం ఆవరణలో భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్న కైకాల సేవా సంఘ ప్రతినిధులు

అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: శంకుస్థాపన వారోత్సవాల్లో భాగంగా నగరంలోని 28, 29, 30 డివిజన్‌లలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు గురువారం పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే శంకుస్థాపన వారోత్సవాలు పేరిట వారం రోజుల పాటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. 28వ డివిజన్‌లో రూ. పది లక్షలు, 29వ డివిజన్‌లో రూ. ఆరు లక్షలు, 30 డివిజన్‌లో రూ. పదహారు లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ ఆరో తేదీ నుంచి పూర్తయిన పనులకు వారం రోజుల పాటు ప్రారంభ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, యువజన నాయకులు ఈశ్వర్ కౌశిక్, డివిజన్ కార్పొరేటర్లు జకీర్ హుస్సేన్, పతివాడ గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా గుర్రాల పరుగు పోటీలు



పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం

జామి: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని గొడికొమ్ము గ్రామంలో రామాలయ ధర్మకర్త బొబ్బిలి రమణబాబు, సర్పంచ్ పిల్లల భవానీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు ఉల్లాసంగా సాగాయి. పోటీల్లో ఏడు గుర్రాలు పాల్గొనగా, విజయగనరం పెప్సీ రాజు గుర్రం మొదటి స్థానంలో, అలమండ సంత శ్రీనివాసరాజు గుర్రం ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

కల్యాణ వ్యాఖ్యానకర్తకు సన్మానం



మైలవరపును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం పుణ్యక్షేత్రంలో గురువారం జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో వ్యాఖ్యానకర్తగా వ్యవహరించిన మైలవరపు శ్రీనివాసరావును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దుస్సాలువాతో సత్కరించి 400 గ్రాముల వెండి పల్లెం బహుకరించారు. కార్యక్రమంలో అర్చకులు మల్లికార్జున శర్మ పాల్గొన్నారు.

కోలాటం బృందానికి దుస్తుల పంపిణీ



కోలాటం బృందానికి దుస్తులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

వేపాడ: శ్రీరామనవమిని పురస్కరించుకుని కోలాటం బృందానికి విజయనగరం డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు తన స్వగ్రామం నీలకంఠరాజపురంలో సొంత నిధులతో గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఎల్.కోట మండలం గొర్లెవానిపాలెంకు చెందిన 25 మంది మహిళలు,పురుషులు అనకాపల్లి జిల్లా రామయోగి అగ్రహారానికి చెందిన గురువు కొల్లి రాములు నేతృత్వంలో శిక్షణ పొందుతున్నారు. వీరికి కోలాటానికి సంబంధించిన యూనిఫాం(రెండు చొప్పున చీరలు, పంచెలు)ను చినరామునాయుడు సమకూర్చారు.

రామాలయానికి మకరతోరణం బహూకరణ

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామలక్ష్మణులకు గ్రామానికి దాతలు రూ.80 వేల విలువైన మకరతోరణం బహూకరించారు. గ్రామానికి చెందిన పిల్లా వెంకటరమణ, ముమ్మన గణేష్, రామెల జోగినాయుడు, కర్రి సన్యాసిరావు రూ.20 వేల చొప్పున అందజేశారు. ఈ నిధులతో గోపురం ఆకారంతో మకరతోరణం తయారు చేయించారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారామలక్ష్మణులకు గురువారం మకరతోరణం అలంకరించారు.



దాతలు అందజేసిన మకరతోరణం

‘దీక్ష’తో పరిపూర్ణత

● ఆడిటర్ సోమయాజులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయనగరం: భగవంతుడి దీక్ష చేపట్టిన వ్యక్తి పరిపూర్ణుడు అవుతాడని ప్రముఖ ఆడిటర్ ఈఆర్ సోమయాజులు అన్నారు. గురువారం స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో ఉత్తరాంధ్ర జిల్లాల భవానీ దీక్ష సేవాపీఠం ఆధ్వర్యంలో తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలన్నారు. సేవాపీఠం వ్యవస్థాపకుడు పులపా మల్లేశ్వరరావు మాట్లాడుతూ ‘దీక్ష’ అనేది నేటిది కాదని, త్రేతాయుగంలో శ్రీరాముడు, ద్వాపర యుగములో శ్రీకృష్ణుడు, పాండవులు, మునులు ఎందరో దుర్గాదేవి దీక్ష చేసి విజయాలు సాధించారన్నారు. కాళిదాసు ‘కాళీమాత’ దీక్ష చేపట్టి మహాకవి కాళిదాసుగా.. వీర శివాజీ భవానీ మాతను కొలిచి అనేక విజయాలు సాధించారని చెప్పారు. దీక్ష వల్ల క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అనంతరం పంచముఖ ఆంజనేయ నిత్య అన్నప్రసాద వితరణ ట్రస్ట్ కార్యదర్శి పెంటపాటి కామరాజును సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.మురళీ, పాతూరి సత్యనారాయణ, కె.అప్పలరాజు, మిరప బంగారప్పడు, ఎస్. దుర్గారావు, కె.అబద్ధం, తదితరులు పాల్గొన్నారు.

ఏకశిలకు ఘనస్వాగతం పలుకుదాం



విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి సంబంధించి పట్టణానికి చేరుకుంటున్న ఏకశిలకు శుక్రవారం ఘనస్వాగతం పలకనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీతో పాటు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడు తూ దాదాపు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో పట్టణ శివారున అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఆలయంలో 18 మెట్లు (పడిమెట్లు) ఏర్పాటుకు సంబంధించి గుంటూరు జిల్లా నుంచి దాదాపు రూ.8 లక్షల విలువైన ఏకశిలను రప్పిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం పట్టణంలో ఆంజనేయపురం వద్ద ఏకశిలకు భక్తులు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలకాలని కోరారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం భారీ ఊరేగింపుగా మెయిన్‌రోడ్, మూడు రోడ్ల జంక్షన్, లావేరురోడ్ మీదుగా అయ్యప్ప ఆలయానికి ఏకశిల చేరుకుంటుందని తెలిపారు. పట్టణంతో పాటు మండలంలోని భక్తులు అంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు గంట్యాడ విష్ణు, అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, ఒమ్మి రమేష్, మంగళగిరి శ్రీనివాసరావు, ఇప్పిలి తిరుమల, రౌతు పైడిరాజు, బూరాడ మహేష్, ఇప్పిలి కృష్ణ, పాండ్రంకి వాసు, పనస అప్పారావు పాల్గొన్నారు.